క్లుప్తంగా

పొగాకు ఉత్పత్తులతో అనారోగ్యం



అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్: పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు బీడీ, చుట్ట, సిగరెట్, జర్దా, తంబాకు, పాన్‌మసాలా వంటి వాటిని వినియోగించొద్దని తెలిపారు. వీటి వల్ల క్యాన్సర్, శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200 జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఫతేఖాన్ దర్గా ఉత్సవాలు



దర్గాలో ప్రార్థన చేస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి: జిల్లాలోని ఫతేఖాన్ దర్గా 140వ ఉర్సులో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఖవాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా ఉర్సుకు వచ్చానని ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థన చేశానని తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు సమద్, సభ్యులు కౌన్సిలర్ షఫీ,కూన సంతోష్, మసూద్, మొయిద్, పర్వేజ్,రహ్మత్, తహెర్ పాషా, అమెర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



పనులు పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్–మాసాన్‌పల్లి రోడ్డు దెబ్బతినడంతో బుధవారం పోలీసులు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఎస్‌ఐ వెంకటేశం ఆధ్వర్యంలో గుంతల్లో మట్టి వేయించి చదును చేశారు. రోడ్డుకు ఇరువైపుల పెరిగిన ముళ్లపొదలు తొలగించారు. కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి పనులను పరిశీలించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేయించినట్లు తెలిపారు.

బోరపట్లలో వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సిబ్బంది

హత్నూర(సంగారెడ్డి): వైద్య శిబిరం ఏర్పాటు చేయండి 'అంటూ సాక్షి దినపత్రికలో బుధవారం వచ్చిన కథనానికి అధికారులు బోరపట్ల గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనారోగ్యానికి గురైన ప్రజలకు వైద్యం అందించారు. దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు హిమబిందు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఎవరికైనా వాంతులు, విరోచనాలు వస్తే వెంటనే ఆస్పత్రికి రావాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంగమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్ టౌన్: రైతు భరోసాకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జహీరాబాద్ డివిజన్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. జనవరి 1 వరకు కొత్త పట్టదారు పాస్ పుస్తకాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. పట్టదారు పాసుపుస్తకం, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డు ఇతర పత్రాల జిరాక్స్ కాపీలను గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారికి అందజేయాలన్నారు. పలు కారణాల వల్ల రైతు భరోసా రాని రైతులు కూడా సరైన పత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రెండో రోజూ అవే నిరసనలు

- ఎన్నిసార్లు దరఖాస్తులు తీసుకుంటారు?
- బోర్గి గ్రామసభలో అధికారుల నిలదీత



పటాన్‌చెరు టౌన్: పాశమైలారం గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

రెండో రోజూ బుధవారం అదే నిరసనలు.. నిలదీతలతో గ్రామసభలు నిర్వహించారు. గ్రామ, వార్డు సభల్లో అధికారులకు నిలదీతలు, నిరసన సెగలు తగిలాయి. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక ఈ నెల 24 వరకు గ్రామాలు, పట్టణాల్లో వార్డులవారీగా సభలు నిర్వహించనున్నారు.

కంగ్టి(నారాయణఖేడ్): గత ఏడాది ప్రజాపాలనలో తీసుకొన్న దరఖాస్తులు ఏమయ్యాయి, ఎన్నిసార్లు తీసుకొంటారని బుధవారం బోర్గి గ్రామసభలో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బోర్గి గ్రామంలో ఎంపీఓ సుభాష్, పంచాయతీ సెక్రటరీని గ్రామస్తులు కోరారు. గతంలో ఇచ్చిన దరఖాస్తుదారుల పేర్లు సైతం జాబితాలో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సుక్కల్‌తీర్థ్, పోట్‌పల్లి, బాబుల్‌గాం గ్రామాల్లో సైతం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, ఎస్‌ఐ విజయ్‌కుమార్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రైతు భరోసాపై నిలదీత

పటాన్‌చెరు టౌన్: రైతు భరోసాపై ప్రజలు అధికారులను నిలదీశారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం, క్యాసారం, పెద్దకంజర్ల, ఇంద్రేశం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాశమైలారంలో గ్రామసభలో ప్రజలు, నాయకులు రైతు భరోసాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రైతు భరోసా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలాగే, పెద్ద కంజర్ల గ్రామంలో గతంలో హెచ్‌ఎండీఏకు ఇచ్చిన భూములకు తగిన నష్టపరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. ఇచ్చిన భూముల్లో రైతులకు ప్లాట్లు కేటాయించాలని కోరారు. దీంతో స్పందించిన తహసీల్దార్ రంగారావు ఏదైనా ఉంటే లేఖ రాసి ఇస్తే ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో..

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో ఇందిరమ్మ రైతు భరోసా, ప్రభుత్వ పథకాలపై గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, ఏడీఏ నూతన్‌కుమార్, ఎంపీడీఓలు రమేష్‌బాబు, మల్సూర్, తహసీల్దార్లు శివశ్రీనివాస్, ఉమశంకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల అన్నారు. మండలంలోని చందాపూర్, పొట్టిపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, ఎంపీడీఓ లక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న పాల్గొన్నారు.

వట్‌పల్లి, అందోల్ మండలాల్లో..

వట్‌పల్లి(అందోల్): సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా రెండవ రోజూ వట్‌పల్లి, అందోల్ మండలాల్లోని వట్‌పల్లి, రోళ్లపహాడ్ గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. లబ్ధిదారుల ముసాయిదా జాబితాను చదివి వినిపించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి మండల ప్రత్యేక అధికారి ఖాసిమ్, ఎంపీడీఓ యాదగిరి అన్నారు. మండలంలోని పసల్వాది, కులబ్‌గూర్, కలబ్‌గూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయన్నారు. పసల్వాదిలో గ్రామసభ నిర్వహిస్తుండగా డంప్ యార్డ్‌ను తొలగించాలని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో గ్రామసభను రద్దు చేశారు.

అర్హులకు రేషన్ కార్డులు, ఇళ్లు

నారాయణఖేడ్: అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ తెలిపారు. పట్టణంలోని నాలుగు వార్డుల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియని తెలిపారు.

పేరులేదని ఆవేదన

జహీరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నా జాబితాలో తమ పేర్లు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కోహీర్ మండలంలోని దిగ్వాల్‌లో ర్వహించిన గ్రామసభలో ప్రజలు ఎంపీడీఓ భారతి దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. జాబితాలో పేర్లు లేని వారి నుంచి తిరిగి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతోందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దీంతో కొంతసేపు గందరగోళం నెలకొంది.

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో..

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, మీ సేవ ద్వారా ఆహార భద్రత కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభ ఆమోదం పొందిన నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

ప్రతీ లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు: అడిషనల్ కలెక్టర్

మునిపల్లి(అందోల్): ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు మంజూరవుతాయని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తాటిపల్లి, మేళసంగ్యం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. బుదేరా గ్రామ సభకు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రైతుభరోసా, ఆత్మీ య భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తీసుకోవడానికి మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి డివిజన్ పంచాయతీ అధికారి అనిత, అగ్రికల్చర్ ఏడీఏ సత్యనారాయణ, ఎంపీడీఓ హరినందన్‌రావు, ప్రజలు పాల్గొన్నారు.



పసల్వాదిలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



జహీరాబాద్: ఎంపీడీఓను నిలదీస్తున్న ప్రజలు

కాలిన చెరుకు తోట పరిశీలన



చెరుకు పంటను పరిశీలిస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి గ్రామంలో అగ్నిప్రమాదంతో కాలిపోయిన చెరుకు పంటను బుధవారం మండల అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ హసీనా బేగం, వ్యవసాయ అధికారి హస్మోద్దీన్, ఆర్‌ఐ.సాయికిరణ్ తదితరులు సందర్శించారు. ఎన్ని ఎకరాల్లో పంట కాలిపోయింది. ఎంత నష్ట జరిగింది.. తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల 36 ఎకరాల్లో చెరుకు పంట, 9 ఎకరాల్లో డ్రిప్ పైపులు, 15 బోరు మోటార్లు కాలిపోయి లక్షల్లో ఆస్తినష్టం జరిగిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

గ్రామసభలతో కొత్త నాటకానికి తెర

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



విలేకరులతో మాట్లాడుతున్న శంభీపూర్ రాజు

జిన్నారం (పటాన్‌చెరు): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గ్రామసభల పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువత అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామసభల కార్యక్రమాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సర్వేల పేరుతో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే పథకాలు అందుతాయనడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాటానికి బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి. వెంకటేశంగౌడ్, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, రాజు, ఆంజనేయులు, సదానందరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని గడి ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మైనోద్దీన్ బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు చదువుతుంటారని అన్నారు. మంచి మార్కులతో పాస్ అయ్యేందుకు ప్రతి సంవత్సరం స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు కష్టపడిగా కాకుండా ఇష్టంగా చదుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జహీరాబాద్ అధ్యక్షుడు అక్తర్ అహ్మద్, నాయకులు ఆమెర్ బిన్ అబ్దుల్లా, రఫీ, షేక్ ఇలియాస్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల నిరసన

జహీరాబాద్ టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని బుధవారం ఎల్‌ఐసీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ.. తమ సంఘానికి చట్టబద్ధ కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. బీమా మొత్తంపై చెల్లిస్తున్న జీఎస్టీని ఎత్తివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, మాణయ్య, సాయిహరి, చంటి, అశోక్, రాజశేఖర్, రామకృష్ణ, మధుసూదన్, నర్సింలు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఆర్డీఓ అశోక్ చక్రవర్తి

కల్హేర్(నారాయణఖేడ్): టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్డీఓ అశోక్ చక్రవర్తి విద్యార్థులకు సూచించారు. బుధవారం సిర్గాపూర్ మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణకు షీ టీం

మునిపల్లి(అందోల్): ఆడపిల్లల రక్షణ కోసం షీ టీం పని చేస్తుందని బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ అన్నారు. బుధవారం మునిపల్లి మోడల్ స్కూల్‌లో సైబర్ క్రైం, ట్రాఫిక్ నిబంధనలు, టీజింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజేశ్ నాయక్‌లకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లిక, ఉపాధ్యాయులు శాలువా కప్పి సన్మానం చేశారు. ఎవ్వైనా అవసరమైతే వెంటనే పోలీసులు, షీటీంకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని 18 నుంచి 45 ఏళ్ల మహిళలకు ఫిబ్రవరి 6 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 9490103390, 970446956 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా 8 మందికి రూ.1500, ఒకరికి రూ. 2 వేలు, మరో వ్యక్తికి రూ.వెయ్యి జరిమానా విధించారు. ఒకరికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

మునిపల్లి(అందోల్): మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో తాటిపల్లి నుంచి కంకోల్ శివారు 65వ నంబర్ జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డు పనులను మాజీ ఎంపీపీ రాంరెడ్డి బుధవారం ప్రారంభించారు. రోడ్డు పనులు పూర్తయితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, దర్జి మారుతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ పదవీ విరమణ వయస్సు పెంచొద్దు

సంగారెడ్డి: ప్రభుత్వ ఉద్యోగులు, కార్మిక ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచొద్దని ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 63 ఏళ్లకు పెంచుతున్నట్లుగా జరుగుతున్న ప్రచారంపై ప్రభుత్వ పెద్దలు స్పందించాలన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మూడేళ్లు పెంచి సర్వత్రా విమర్శలపాలైందని ఎద్దేవా చేశారు. ఉద్యోగ విరమణ వయస్సు పెంచడమంటే లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టినట్టేనని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని ఖండించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

◆ ఆడపిల్లలను చదివించాలి

కంది(సంగారెడ్డి): మగపిల్లలు, ఆడపిల్లలనే వివక్ష లేకుండా బాలికలను చదివించాలని మండల విద్యాధికారి జోగప్ప పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మామిడిపల్లిలో జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మిషన్‌శక్తి భేటీ బచావో భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోగప్ప మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాల్లో ముందు ఉండాలన్నారు. విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి గ్రామంలో బైక్, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారిత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, ప్రిన్సిపాల్ సుజాత, సూపర్‌వైజర్లు సునీత బాయి, విశాలతో పాటు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరు టౌన్: మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉ.10:30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పాటీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ జగదీష్ రావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

◆ 24న పండరీపూర్‌కు పాదయాత్ర

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని పండరిపూర్ పుణ్యక్షేత్రానికి 24న పట్టణంలోని శ్రీరామమందిరం నుంచి 27వ విడత పాదయాత్ర బయలుదేరుతుందని అంతర్‌గామ రుక్మిణి, పాండురంగ ఆలయపీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్ తెలిపారు. పాదయాత్రికులకు ఇబ్బందులు లేకుండా 20 మందితో కూడిన భక్తుల సేవా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను భక్తులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

రావిఆకుపై చంద్రబోస్‌కు నివాళి



23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఖేడ్ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ రావి ఆకుపై చంద్రబోస్ చిత్రాన్ని మలిచారు. చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.

– నారాయణఖేడ్

ప్రారంభోత్సవం అడ్డుకోవడం సరికాదు

మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత



విలేకరులతో మాట్లాడుతున్న లలిత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గత ప్రభుత్వంలో రాజీనామా చేసి సాధించుకున్న మున్సిపల్ ఫంక్షన్ హాల్‌ను పూర్తి చేసి ప్రారంభించుకోనే సమయంలో కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడం సరికాదని మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఫంక్షన్ హాల్ లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తి చేసి ప్రారంభించుకోనే సమయంలో రాజకీయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నెల 18న మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో 22న ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించుకుందామని తీర్మానం చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం సరే అంటూ చేతులు ఎత్తారని తెలిపారు. దీనిని తమ హయాంలో ప్రారంభించుకోవడం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి ఇష్టంలేదని ఆరోపించారు. స్వయంగా కమిషనర్ సంగారెడ్డి మంత్రి, ఎమ్మెల్యే వద్దకు వెళ్లి డబుల్ గేమ్ ఆడారని మండిపడ్డారు. మున్సిపల్ పాలకవర్గం పదవికాలం ముగిసిన తరువాత ప్రారంభిస్తే శిలాఫలకంపై పాలకవర్గ పేర్లు ఉండవని వివరించారు. మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి 27 లోపు ప్రారంభించి.. శిలాఫలకంపై తమ పేర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



తనిఖీలు నిర్వహిసున్న ట్రాఫిక్ పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పట్టణ ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని ఐబీ వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆయా పాఠశాల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎవరూ కూడా మద్యం సేవించలేదని పోలీసులు తెలిపారు. అనంతరం ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. అతివేగం, అజాగ్రత్తగా నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దన్నారు. విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చే విషయంలో జాగ్రత్తగా వాహనాలను డ్రైవింగ్ చేయాలని సూచించారు. యూనిఫామ్, బ్యాచ్ నంబర్‌తో కూడిన డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

జహీరాబాద్: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని ఎస్‌ఐ కాశీనాథ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు ఎవరికి వారు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని త తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్



సుజాతను సన్మానిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

సంగారెడ్డి టౌన్: ఈ నెల 21న లింగంపల్లి నుంచి సంగారెడ్డి వస్తున్న బస్సులో శాంతయ్య అనే ప్రయాణికుడు తన బ్యాగును వదిలి వెళ్లాడు. గమనించిన కండక్టర్ సుజాత బ్యాగును చూడగా అందులో నాలుగు లక్షల విలువ గల బంగారం (వంకు, రింగు, కమ్మలు, మూడు తులాల బంగారం) ఉంది. దీంతో ఆమె బ్యాగును డిపో అధికారులకు అందజేశారు. బీహెచ్‌ఎల్ హాస్పిటల్ బుక్ ఆధారంగా కంది గ్రామానికి చెందిన శాంతయ్యగా గుర్తించి ఆయనను పిలిపించి బ్యాగును అందజేశారు. కండక్టర్‌ను ఆర్టీసీ సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి, సన్మానించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ



వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో వ్యవసాయాధికారులతో కలిసి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పంట పొలాలను పరిశీలించారు. ప్రధానంగా యాసంగిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మెలకువల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా పొలంలో అక్కడక్కడ సల్ఫైడ్ దుష్ప్రభావ లక్షణాలు గమనించి, నివారణకు నాటు వేసిన పొలాన్ని ఆరబెడుతూ నీటిని అందించాలన్నారు. నాటు వేసే 15 రోజుల ముందు రైతులు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువును పొలమంతా చల్లి కలియదున్నాలి. ముఖ్యంగా వరిపంటలో మొగిపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఒక ఎకరానికి 8–10 కిలోలు ఇసుకలో సమానంగా కలిపి సాయంత్రం వేళల్లో చల్లుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సరిత, జోగిపేట ఏడీఏ రమాదేవి, ఏఈఓ లక్ష్మీకాంత్, రైతులు పాల్గొన్నారు.